తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
11 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 302
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం

- స్వాతంత్ర్య వేడుకల్లో ప్రత్యేక గీతాలాపన
- 150 ఏళ్ల సందర్భంగా ఘన నివాళి
- యువశక్తికి ప్రాధాన్యమివ్వనున్న వేడుకలు
- వందేమాతరం అవమానంపై కఠిన శిక్షలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10 దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోటపై తొలిసారిగా వందేమాతరం గేయం ఆలపించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో ఈ ప్రత్యేక గీతాలాపన జరగనుంది. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు రక్షణ శాఖ కార్యదర్శి ఆర్‌కే సింగ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోటకు చేరుకున్న అనంతరం వందేమాతరం గేయాన్ని ఆలపిస్తారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి

మిగతా 2వ పేజిలో..


## పెద్ది సేవలు చిరస్మరణీయం



- హరీశ్‌రావు నివాళులు
- నర్సంపేట అభివృద్ధికి కృషి
- కుటుంబానికి అండగా ఉంటాం

నర్సంపేట, ఆగస్టు 10 నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి, ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నల్లబెల్లిలో సోమవారం నిర్వహించిన పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ, సంస్మరణ సభలో హరీశ్‌రావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న పాతికేళ్ల అనుబంధాన్ని, తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆయనతో కలిసి అనేక ఉద్యమాలు, పోరాటాలు, ఉపఎన్నికల్లో పనిచేశానని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు, ఆస్తులు, పదవులను సైతం లెక్కచేయకుండా పోరాడిన నిస్వార్థ ఉద్యమకారుడని కొనియాడారు. మానుకోట ఘటన, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్ ఉపఎన్నికల సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి

మిగతా 2వ పేజిలో..



# వరుణదేవుని కరుణతో తెలంగాణ సస్యశ్యామలం కావాలి!

- 108 మంది రుత్వికులతో యాగం
- ఉత్తంకుమార్ రెడ్డి దంపతుల హాజరు
- నాగార్జునసాగర్‌లో భక్తిశ్రద్ధల మధ్య మహా వరుణయాగం ముగింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతుల పూర్ణాహుతి..
- రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థనలు
- వర్షాలతో తెలంగాణ పచ్చని వనంగా మారాలి
- ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతిలో భాగం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు 10 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. రైతుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని.. చెరువులు, కుంటలు జలకళతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం సోమవారం నాగార్జునసాగర్‌లో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది. కృష్ణానది తీరంలోని విజయ్ విహార్ వద్ద నిర్వహించిన ఈ మహా యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని శాస్త్రోక్తంగా పూర్ణాహుతి సమర్పించారు.

వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువులతో నాగార్జునసాగర్ తీరం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాల వద్ద ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వరుణదేవుని అనుగ్రహం కోసం వైదిక పద్ధతిలో యజ్ఞక్రతువులు చేపట్టి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగాలని ప్రార్థించారు

### రైతు సంక్షేమమే లక్ష్యంగా..

వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ రంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు సంకల్పంతో ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని

మిగతా 2వ పేజిలో..

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కార్యక్రమంలో రాజకీయ వేడి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం
- ప్రభుత్వ వేదికపై రాజకీయ విమర్శలు చేయొద్దని సూచన
- వాస్తవాలు చెప్పాలని మంత్రులకు విజ్ఞప్తి
- కమలాపూర్ కార్యక్రమంలో చర్చనీయాంశమైన వ్యాఖ్యలు



హుజూరాబాద్, ఆగస్టు 10: కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రాజకీయ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రసంగిస్తున్న సమయంలో రాజకీయ విమర్శలు, వాస్తవాలకు విరుద్ధమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో రాజకీయ అంశాలను ప్రస్తావించడం సరికాదని

మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరం మోటార్లు వెంటనే ప్రారంభించాలి

- హరీష్ రావు లేఖతో ప్రభుత్వానికి విజ్ఞప్తి
- నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్
- రిజర్వాయర్లు నింపి రైతుల ఆందోళన తొలగించాలని సూచన
- వర్షాభావ పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టాలన్న విజ్ఞప్తి

2వ పేజిలో..

## విద్యార్థులపై బలప్రయోగం సరికాదు!

- పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు రాహుల్‌గాంధీ మద్దతు
- లాఠీఛార్జ్, బాష్పవాయువు, వాటర్ కెనాన్లపై తీవ్ర ఆగ్రహం.. చర్చలతో సమస్య పరిష్కరించాలని సూచన

రాంచీ, ఆగస్టు 10జార్ఖండ్‌లో పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు,

మిగతా 2వ పేజిలో..



## పెద్ది సుదర్శన్‌కు కేటీఆర్ నివాళి

- నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు
- కేటీఆర్ కీలక ప్రకటన
- పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ
- కేసీఆర్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

నర్సంపేట, ఆగస్టు 10 : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు. సోమవారం నర్సంపేటలో నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొన్న కేటీఆర్, సుదర్శన్ రె

మిగతా 2వ పేజిలో..

## ప్రియాంక మృతదేహం స్వగ్రామానికి తరలింపు

- మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే శ్రీనివాస్ పరామర్శ
- తల్లిదండ్రులకు మృతదేహం అప్పగించిన వైద్యులు

2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 11 ఆగస్టు , 2026


# ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం

ప్రసంగిస్తారు. ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో యువశక్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలన్న లక్ష్యంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ఈ వేడుకల ద్వారా చాటిచెప్పనున్నారు.వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో ప్రజల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని రగిలించిన గేయంగా వందేమాతరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎర్రకోటపై స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపించడం ద్వారా దాని చారిత్రక ప్రాధాన్యాన్ని మరోసారి దేశానికి చాటిచెప్పనున్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గేయానికి సంబంధించిన కొత్త నిబంధనలపై ఇటీవల పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందింది. వందేమాతరం గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించడం, దాని ఆలాపనకు ఆటంకం కలిగించడం లేదా అడ్డుకోవడం వంటి చర్యలకు శిక్షలు విధించే నిబంధనలు అందులో పొందుపరిచినట్లు కేంద్రం తెలిపింది. నిబంధనలను ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

వందేమాతరం గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ 1875లో రచించారు. అనంతరం ఆయన రచించిన ఆనందమఠ్ నవలలో ఈ గేయాన్ని చేర్చారు. స్వాతంత్య్ర ఉద్యమ కాలంలో వందేమాతరం ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్య్ర స్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. స్వాతంత్య్రం అనంతరం దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు. దేశ 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఈసారి ప్రత్యేకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వందేమాతరం గేయానికి 150 ఏళ్ల చారిత్రక సందర్భం, యువశక్తికి ప్రాధాన్యం, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని ప్రధాన అంశాలుగా తీసుకుని వేడుకలను నిర్వహించనున్నారు. ఎర్రకోటపై తొలిసారి వందేమాతరం గేయం ఆలపించనుండటంతో ఈ ఏడాది స్వాతంత్య్ర వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

## పెద్ది సేవలు చిరస్మరణీయం

పోరాట స్ఫూర్తి, కష్టం ప్రత్యేకంగా కనిపించేవని చెప్పారు. తెలంగాణ సాధించే వరకు పోరాడి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత నర్సంపేట అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు.ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ ఆయన సేవలను గుర్తించిన కేసీఆర్ క్యాబినెట్ హోదా కల్పించి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారని హరీశ్‌రావు తెలిపారు. నర్సంపేట ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పారు. రామప్ప, పాకాల, లక్నవరం చెరువులకు దేవాదుల నీటిని అందించేందుకు కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేసి నీటిని విడుదల చేయించారని వివరించారు. ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించుకోవాలనే లక్ష్యంతో రాత్రింబవళ్లు శ్రమించారని, ఆయన కృషి వల్లే గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రం కాని ప్రాంతంలో మెడికల్ కాలేజీ సాధించిన ఏకైక నియోజకవర్గంగా నర్సంపేట నిలిచిందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఆలోచనతో పాటు నర్సంపేటపై పెద్ది సుదర్శన్ రెడ్డికి ఉన్న ప్రేమ, పట్టుదల కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. కాకతీయ రెడ్డి రాజులు నిర్మించిన దేవాలయం కూల్చివేతకు వ్యతిరేకంగా తాను, పెద్ది కలిసి చేసిన నిరసన కార్యక్రమమే తమ చివరి కార్యక్రమంగా మారిందని గుర్తుచేశారు. అదే చివరి కలయిక అవుతుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న రైతు కుటుంబంలో పుట్టి పోరాటాల ద్వారా ఎదిగిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు.ఉద్యమ సమయంలో ఓ అమరవీరుడి అంతిమయాత్ర సందర్భంగా పోలీసులతో జరిగిన తోపులాటలో తాను డీసీఎం పైనుంచి కిందపడిపోయినప్పుడు పెద్ది సుదర్శన్ రెడ్డి తనను ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అయితే అదే ఆసుపత్రిలో ఆయనకు చివరిచూపు చూడాల్సి వస్తుందని ఎన్నడూ ఊహించలేదని చెబుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ప్రభుత్వం నుంచి ఎన్ని ఒత్తిళ్లు, ప్రలోభాలు వచ్చినా పెద్ది సుదర్శన్ రెడ్డి తలొగ్గలేదని, ప్రభుత్వ అక్రమాలపై చివరి శ్వాస వరకు ఉద్యమ స్ఫూర్తితో పోరాడారని అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా ప్రజల కోసం చేసిన పోరాటం, సేవలు, జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు అవసరమైతే అమెరికా, లండన్ నుంచి వైద్యులను తీసుకురావాలని, ఎంత ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని కేసీఆర్ చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. పెద్ది పట్ల కేసీఆర్‌కు ఉన్న అనుబంధానికి ఇది నిదర్శనమన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి, నర్సంపేట ప్రజలకు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల కోసం పనిచేయడమే పెద్ది సుదర్శన్ రెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## పెద్ది సుదర్శన్‌కు కేటీఆర్ నివాళి



సేవలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలకంగా పనిచేసిన గొప్ప నాయకుడిగా ఆయనను కొనియాడారు. నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకునేలా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. సుదర్శన్ రెడ్డి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారని పేర్కొన్నారు.ఎంతకాలం జీవించామన్నది కాదని, ఎలా జీవించామన్నదే ముఖ్యమని కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారని, ఆయన అంత్యక్రియలకు తరలివచ్చిన భారీ జనసందోహమే ప్రజల్లో ఆయనకున్న అభిమానానికి నిదర్శనమని చెప్పారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సుదర్శన్ రెడ్డి అత్యంత సన్నిహితంగా పనిచేశారని కేటీఆర్ గుర్తుచేశారు. జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఆయన వివిధ బాధ్యతలు నిర్వహించారు. 2018 నుంచి 2023 వరకు నర్సంపేట ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు.గత నెల 31న గుండెపోటుతో పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందారు. ఆయన మరణంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నర్సంపేటలోని సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తరపున ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి సుదర్శన్ రెడ్డి పేరు పెట్టాలన్న కేటీఆర్ ప్రకటనతో ఆయన సేవలకు గౌరవం లభించినట్లయిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# వరుణదేవుని కరుణతో తెలంగాణ సస్యశ్యామలం కావాలి!

కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్ సహా ప్రధాన జలాశయాలన్నీ నిండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

చెరువులు, కుంటలు నిండిపోవడంతో పాటు భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి రైతులకు సాగునీటి కొరత లేకుండా ఉండాలని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రం సస్యశ్యామలంగా మారి రైతుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

### ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతిలో భాగం

భారతీయ సంస్కృతిలో ప్రకృతిని ఆరాధిస్తూ యాగాలు, యజ్ఞాలు నిర్వహించడం శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో పాటు ప్రకృతి పట్ల గౌరవాన్ని వ్యక్తం చేసే ఆధ్యాత్మిక సంప్రదాయాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి, వ్యవసాయం, మానవ జీవనం మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తుచేసే కార్యక్రమంగా మహా వరుణయాగాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, పి. సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### వర్షాలతో తెలంగాణ పచ్చని వనంగా మారాలి

వేదమంత్రాల ఘోష.. హోమగుండాల నుంచి వెలువడిన పవిత్రాగ్ని.. కృష్ణానది సాక్షిగా సాగిన వైదిక క్రతువులతో నాగార్జునసాగర్ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వరుణదేవుని కరుణతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండి, పంట పొలాలు పచ్చగా కళకళలాడాలని.. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మహా వరుణయాగం విజయవంతంగా ముగిసింది.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కార్యక్రమంలో రాజకీయ వేడి

ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాల వేదికలను రాజకీయ విమర్శలకు ఉపయోగించకూడదని సూచించారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు.

ఈ సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ "అబద్ధాలు చెప్పొద్దు.. నిజాలు మాట్లాడాలి" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయడం ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమం అసలు ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం అమలులో గత ప్రభుత్వ పాత్రను గుర్తించాలని ఆయన అన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ రంగు పులమకుండా నిర్వహిస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంక్షేమ కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల దృష్టి ప్రధానంగా ఇళ్ల పంపిణీపై ఉండగా, రాజకీయ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయని స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ప్రసంగాల అవసరంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని పాడి కౌశిక్ రెడ్డి కోరారు. ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, అమలవుతున్న పథకాల గురించి స్పష్టమైన సమాచారం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తేనే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాళేశ్వరం మోటార్లు వెంటనే ప్రారంభించాలి

- హరీష్ రావు లేఖతో ప్రభుత్వానికి విజ్ఞప్తి
- నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్
- రిజర్వాయర్లు నింపి రైతుల ఆందోళన తొలగించాలని సూచన
- వర్షాభావ పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టాలన్న విజ్ఞప్తి



హైదరాబాద్, ఆగస్టు 10 కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపేందుకు మోటార్లను ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకుని తక్షణమే నీటి పంపింగ్ చేపట్టాలని ఆయన కోరారు. ప్రస్తుతం వానాకాలం సాగు సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తగినంత వర్షపాతం లేకపోవడం, మరోవైపు రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నిల్వ చేయకపోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదని లేఖలో వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) రిజర్వాయర్లను నింపితే సుమారు నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని హరీష్ రావు తెలిపారు. మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం గణనీయమైన నీటి నిల్వలు ఉన్నాయని, వాటిని వినియోగించి వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించాలని సూచించారు.

**– హరీష్ రావు ప్రస్తావించిన నీటి లభ్యత**

మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపాలని కోరారు.


**– రైతుల ఆందోళనపై ఆవేదన**

గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టులో నాలుగు లక్షల ఎకరాలకు పైగా సాగు జరిగిన విషయాన్ని గుర్తు చేసిన హరీష్ రావు, ప్రస్తుత వానాకాలంతో పాటు రానున్న యాసంగి పంటలకు కూడా నీటి కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రిజర్వాయర్లతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను నింపడం ద్వారా రైతులకు భరోసా కల్పించాలని అన్నారు.లోయర్ మానేరు డ్యామ్ పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని లేఖలో పేర్కొన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని తరలించి ఎస్సారెస్పీ రెండో దశ పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలని సూచించారు.

# ప్రియాంక మృతదేహం స్వగ్రామానికి తరలింపు

- మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే శ్రీనివాస్ పరామర్శ
- తల్లిదండ్రులకు మృతదేహం అప్పగించిన వైద్యులు
- ఏక్లాస్‌పురంలో సాయంత్రం అంత్యక్రియలు
- విషాదంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు





హైదరాబాద్, ఆగస్టు 10 రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయింది. అనంతరం ఆస్పత్రి అధికారులు ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రియాంక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోస్టుమార్టం అనంతరం ప్రియాంక మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన గద్వాల జిల్లా ఐజ మండలం ఏక్లాస్‌పురానికి తరలించారు. స్వగ్రామానికి మృతదేహం చేరుకోగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రియాంకను చివరిసారిగా చూసేందుకు గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆశలు పెట్టుకున్నప్పటికీ, చివరకు ఆమె మృతి చెందడం అందరినీ కలచివేసింది. వైద్య విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో వైద్యురాలిగా సేవలు అందించాలని కలలు కన్న ప్రియాంక అకాల మరణం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- మంత్రి వాకిటి శ్రీహరి పరామర్శ**

ప్రియాంక మృతిపై సమాచారం అందుకున్న మంత్రి వాకిటి శ్రీహరి గాంధీ ఆస్పత్రికి చేరుకుని ఆమె తండ్రిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో ప్రభుత్వం కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజమండ్రి ఎమ్మెల్యే శ్రీనివాస్ కూడా ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రియాంక మృతి అత్యంత బాధాకరమని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదగాల్సిన యువతి అకాల మరణం సమాజానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. ప్రియాంక అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ఆమె స్వగ్రామం ఏక్లాస్‌పురంలో నిర్వహించనున్నారు. అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. ప్రియాంక మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# విద్యార్థులపై బలప్రయోగం సరికాదు!

వాటర్ కెనాన్లు ప్రయోగించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని, తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న వారిపై బలప్రయోగం చేయడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని జార్ఖండ్ ప్రభుత్వానికి సూచించారు.

జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థులు గత నెల రోజులుగా రాజధాని రాంచీలో ఆందోళన చేస్తున్నారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం పలుమార్లు చర్చలు జరిపినా అవి ఫలించలేదు. తమ ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సోమవారం విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించారు.

విద్యార్థులను పోలీసులు అడ్డుకునే క్రమంలో లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువు, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. దీంతో రాంచీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై స్పందించిన రాహుల్‌గాంధీ.. విద్యార్థులపై బలప్రయోగం చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనకు గల కారణాలను అర్థం చేసుకుని, వారి ప్రతినిధులతో చర్చించి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.

జార్ఖండ్‌లో అధికార కూటమిలో కాంగ్రెస్ కూడా భాగస్వామిగా ఉంది. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్ , వామపక్ష పార్టీలతో కలిసి కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వ తీరుపై రాహుల్‌గాంధీ బహిరంగంగా స్పందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలా ఉండగా ఢిల్లీలో జరిగిన మరో విద్యార్థుల ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపైనా రాహుల్‌గాంధీ స్పందించారు. విద్యార్థులపై బలప్రయోగం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశించారా? లేదా? అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చలు, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించాలని ప్రభుత్వాలను కోరారు.

"విద్యార్థుల గొంతు వినాలి.. వారి డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి" అనే సందేశంతో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 11 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# మృతుని కుటుంబానికి అర్థిక సహాయం అందజేత



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 10 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన వనగంటి స్వామి చాలా రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగెంలో ఏకగ్రీవంగా నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక



**సంగెం,ఆగస్టు10 తరంగాలు**
మండల కేంద్రంలో సోమవారం రోజున ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. టీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు సధిరం కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చిక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, జిల్లా కోశాధికారి గాయపు రాజిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాయకులు అధికారికంగా ప్రకటించారు.
సంగెం మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేల్పుల అనిల్ యాదవ్ (ప్రజాజ్యోతి), ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా వీరస్వామి (సూర్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం మచ్చిక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మరియు సామరస్య వాతావరణంలో ఈ ఎన్నికలు జరగడం అభినందనీయమన్నారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవం చేసిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు మరియు తోటి విలేకరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, పత్రికా విలువలను కాపాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని హామీ ఇచ్చారు. నూతన కమిటీకి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు సిద్ధ నాగరాజు (నిఘా), మందపూరి బలరామ్ (తెలంగాణ గళం), హరి (ఏబీ న్యూస్), ఏలీయా (ప్రభంజన పదం), విజయ్ (సామాజిక తెలంగాణ), ఐతే కుమార్ (టైమ్ టివి న్యూస్), మండ వేణు (ప్రజాపక్షం), వేల్పుల నాగరాజు (ప్రజాదర్బార్), పుల్ల సతీష్ (అక్షర విజేత) తదితరులు పాల్గొన్నారు

# కదం తొక్కిన కార్మిక కర్షక లోకం విజయవంతమైన జై భరో



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 10,(తరంగాలు):**
కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సోమవారం మండల కేంద్రంలో జై భరో కార్యక్రమం విజయవంతమైంది. మొదటగా అంబేద్కర్ సెంటర్ నుండి రాలిగా వీధుల గుండా తిరుగుతూ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడం జరిగింది. అనంతరం గుండె బోయిన రాజు, నక్క యాకయ్య, మచ్చ శారద అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే వెనుక తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్ల చట్టాలను వెనుకటి తీసుకోకపోతే మరో ఉద్యమం తప్పదని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కొత్తగా తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కూడా వెనక్కి తీసుకొని, పాత మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘంజిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య, సిఐటియు మండల కన్వీనర్ గుండెబోయిన రాజు, మండల నాయకులు కాట సుధాకర్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షబానా , అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శారద, సిఐటియు టౌన్ కార్యదర్శి చిరంజీవి నక్క యాకయ్య ,రైతు సంఘం మండల కార్యదర్శి ప్రాజెక్టు అధ్యక్షురాలు సరస్వతి, రాణి, మండలం అధ్యక్షులు రాయపురం బిక్షపతి, గంగరాజు, రవి, ఖాదర్, నరసింగమ్, కొమురయ్య ,రవి, వ్యవసాయ కూలీలు రైతులు కార్మికులు పాల్గొన్నారు.ం



# విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ఉద్యమం

- 50 గంటల పాటు ఆట.. పాట.. మాటల ప్రస్థానం
- సెప్టెంబర్ 26న ఉదయం పది గంటల నుంచి ప్రజా కళా జాతర ప్రారంభం
- విలేకరుల సమావేశంలో విమలక్క




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట...పాట...మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారు. ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారు. తన జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుళ ప్రజా కళలు,జానపద కళారూపాలు ,ప్రజా కళా జాతర,మనువాదంగా సంస్కృతి మూఢత్వమై,సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను,శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉస్మానియాలో పురుడు పోసుకునేటప్పటికీ బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్థానం ఒక మరుపురాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను కళాకారులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, వర్ష సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.



# ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల రాష్ట్రస్థాయి ముగింపు వారోత్సవ సభలు జయప్రదం చెయ్యండి

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపు




**వరంగల్ జిల్లా ప్రతినిధి,ఆగస్టు 10,(తరంగాలు)**1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించిన ఏ ఐ ఎస్ యఫ్, దేశ స్వాతంత్ర్యోద్యమం నుంచి నేటి వరకు విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. “చదువుతూ పోరాడుతాం -- చదువుకై పోరాడుతాం” అనే నినాదంతో విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఏ ఐ ఎస్ యఫ్ కృషి చేస్తోందన్నారు.ప్రస్తుతం విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం--2020ను పునఃసమీక్షించి విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణమైన విద్యా విధానాన్ని రూపొందించాలని కోరారు.తెలంగాణలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ,అధ్యాపక, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలు,సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని,పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.ఏ ఐ ఎస్ యఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ,600 మంది ప్రతినిధులతో రాష్ట్రస్థాయి వారోత్సవ మహాసభలు సెప్టెంబర్ 28, 29,30 తేదీలలో జరిగే మూడు రోజుల కార్యక్రమాలకు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఏ ఐ ఎస్ యఫ్ లో పనిచేసిన మాజీ నాయకులు,ప్రస్తుత నాయకులు పాల్గొంటారని మొదటిరోజు భారీ ర్యాలీ బహిరంగ సభ,రెండవ రోజు మూడవ రోజు వారోత్సవ మహాసభలు జరగనున్నట్లు డెలిగేట్స్ అందరికీ మూడు రోజులపాటు వసతి,భోజనం, కాన్ఫరెన్స్ హాల్ తదితర సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేయనున్నట్లు ఈ సమావేశంలో విద్యారంగ సమస్యలు పరిష్కార మార్గాలు ఏఐఎస్ఎఫ్ సంఘ నిర్మాణం భవిష్యత్తు ఉద్యమాలపై పలు కీలకమైన నిర్ణయాలు జరగనున్నట్లు తెలిపారు.ఏ ఐ ఎస్ యఫ్ తొమ్మిది దశాబ్దాల పోరాట చరిత్రను స్మరించుకోవడంతో పాటు, ప్రస్తుత విద్యారంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ విద్యార్థి ఉద్యమానికి నూతన కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఏ ఐ ఎస్ యఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలు,రాష్ట్రస్థాయి మహాసభలను విజయవంతం చేసేందుకు విద్యావేత్తలు, మేధావులు,విద్యార్థులు,యువత, ప్రజలు తమ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్,వేల్పుల చరణ్, జిల్లా నాయకులు కే అజయ్,నాగరాజు, వంశీ,రాజు,శ్రావణ్,ముఖేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మహా వర్ణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 10 తరంగాలు** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, మన ప్రాజెక్టులన్నీ జలకళతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్లోని కృష్ణా నది ఒడ్డున ప్రభుత్వం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ‘మహా వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి పాల్గొనడం జరిగింది.యాదగిరిగుట్ట వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పవిత్ర క్రతువులో కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించి, రైతుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని ఆ వరుణ దేవుణ్ణి మనస్ఫూర్తిగా ప్రార్థించాం. ఒకవైపు శాస్త్రీయ ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే. సకల జనుల సుఖసంతోషాల కోసం మన పూర్వీకుల ఆధ్యాత్మిక సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ యాగం నిర్వహించాం. ప్రకృతి అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,శ్రీమతి కొండా సురేఖ,ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు,పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి,పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సుభిక్షం కోసం..
# సాగర్‌లో వరుణ యాగం





**•సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పూర్ణాహుతి నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు**

**నల్గొండ, ఆగస్టు 10 (తరంగాలు):** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో కృష్ణా నది ఒడ్డున రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగం వేదమంత్రాల నడుమ ఘనంగా ముగిసింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 108 మంది ఋత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున 4.05 గంటలకు మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు యాగాన్ని ప్రారంభించారు. గోపూజ, యాగ ప్రదక్షిణ, పుణ్యవచనం, అంకురార్పణం, ఋష్యశృంగ పూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 3.24 గంటలకు నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సీఎం దంపతులకు పూర్ణకుంభంతో, మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, మాజీ మంత్రి జానారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 10,తరంగాలు:** హన్మకొండ జిల్లా పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆహ్వానం పలికారు. సోమవారం మధ్యాహ్నం హసన్పర్తి ఎర్రగట్టుగుట్ట జంక్షన్ వద్ద కార్యకర్తలతో కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్యే



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 10 తరంగాలు** వలిగొండ పట్టణ కేంద్రంలో మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుజల దాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నిరంతరం భువనగిరి నియోజకవర్గం ప్రజల కోసం ప్రజా సమస్యల కోసం అభివృద్ధి కోసం పనిచేసిన మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి మరియు పండ్ల పంపిణీ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్ ముద్దసాని కిరణ్ రెడ్డి వెంకట్ రెడ్డి సంజీవరెడ్డి రమేష్ పాండు నాగరాజు రాములు పెద్దలు కుమార్ ఆయా గ్రామాల సర్పంచులు అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు అండగా వ్యవసాయానికి
# భరోసాగా రాష్ట్రప్రభుత్వం





**•రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం**
**•రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి**
**• మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 10, తరంగాలు :** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ. 2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ. 5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని మంత్రి పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, ఆ జ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు. "శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని,పంటలను,ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూజిల్లా స్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అనితా రెడ్డి -రాంరెడ్డి దంపతులకు గ్లోబల్ బెస్ట్ కపుల్ అవార్డు -2026



**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 10,తరంగాలు** : ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ మరియు గ్లోబల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అండ్ కన్జ్యుమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంస్థ హైదరాబాద్ వారు అనురాగ్ సొసైటీ చైర్మన్ మరియు కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, డాక్టర్ కరుకాల అనితా రెడ్డి, కరుకాల రాంరెడ్డి దంపతులకు వారు సమాజానికి, అనాథలకు, దివ్యాంగులకి, మహిళలకు, వృద్ధులకు, గత 30 సంవత్సరాలుగా స్వంత కర్చులతో నిస్వార్థంగా అందిస్తున్న సమాజ సేవలను గుర్తించి గ్లోబల్ బెస్ట్ కపుల్ అవార్డు -- 2026." అవార్డు ను అందించారు ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ ఒకే మాట,ఒకే బాట, ఒకే సేవ అంటూ జీవితం లోనే కాక సమాజ సేవలోను ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఆదర్శ దంపతులు డాక్టర్ అనితా రెడ్డి, కరుకాల రాంరెడ్డి లను గ్లోబల్ బెస్ట్ కపుల్ -2026 ఎంపిక చేసి ఈ అవార్డు ను అందించడం మా సంస్థ కు గర్వకారణం గా ఉందని డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డు మా సేవలకు గుర్తింపుగా లభించినందుకు చాలా ఆనందంగా ఉందని , భాద్యత మరింత పెరిగిందని మరిన్ని సమాజహితం కోరట్ట కార్యక్రమాలు నిర్వహిస్తామని, అవసరార్దులకు అండగా నిలుస్తామని తెలిపారు ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 11 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలి

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిసి,కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ బీజేపీ బృందం



**న్యూఢిల్లీ, ఆగస్టు 10,తరంగాలు** :వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని తెలంగాణ బీజేపీ బృందం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.వరంగల్-మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఆమోదం తెలిపినందుకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో పాటు మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారామ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్,ప్రొఫెసర్ ఆజ్మీరా



సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా వన్నాల వెంకటరమణ లతో కూడిన బీజేపీ నాయకుల బృందం న్యూఢిల్లీలో జోర్బాగ్ సాఫదారగంజ్ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఒక అధికారిక లేఖ అందజేశారు.తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. తాను మహబూబాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో వరంగల్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ఈ రోజు ఆ కల నెరవేరుతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని లేఖలో ఆజ్మీరా స్మరించుకున్నారు.బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కేంద్ర మంత్రితో జరిగిన భేటీని గుర్తుచేసుకుంటూ..రామ్మోహన్ నాయుడి నిరాడంబరత, అందుబాటులో ఉండే స్వభావం మరియు చురుకైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ పర్యటనకు విచ్చేయాల్సిందిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను బీజేపీ బృందం ఆహ్వానించింది. మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన లేదా అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,ఈ ప్రాంత ప్రజలను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రాక తెలంగాణ ప్రాంత అభివృద్ధికి,కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా అదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి వెంటనే శ్రీకారం చుట్టాలని అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను కోరారు. అలాగే మామునూరు విమానాశ్రయంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు మరియు సమీప ప్రాంతం లోని ప్రజలకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణలి లు మంత్రి ని కోరారు. వీరి విజ్ఞప్తులను అంగీకరించి కేంద్ర మంత్రి పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులను బీజేపీ బృందం సత్కరించింది.




# వరంగల్ ఐటీఐని 'హబ్'గా అప్ గ్రేడ్ చేయాలి

- పీఎం-సేతు కింద హాస్టల్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినతి



**న్యూఢిల్లి, ఆగస్టు 10,తరంగాలు** :వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం–సేతు పథకం కింద 'స్పోక్' నుంచి 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు.1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం సుమారు 1,402 మంది శిక్షణ పొందుతున్నారని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున సంస్థను ఆధునిక సౌకర్యాలతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎస్‌సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట--వరంగల్ రైల్వేతో పాటు ఇతర పారిశ్రామిక రంగాల విస్తరణతో భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని కడియం కావ్య వివరించారు. ఐటీఐని హబ్‌గా అభివృద్ధి చేస్తే ఆధునిక సాంకేతిక పరికరాలు, పరిశ్రమలకు అవసరమైన కోర్సులు, అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు.వరంగల్ ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, మహబూబాబాద్‌లోని సంబంధిత సంస్థలను స్పోక్‌లుగా అభివృద్ధి చేయాలని ఎంపీ ప్రతిపాదించారు. దీనివల్ల ఉమ్మడి ప్రాంతంలో నైపుణ్య శిక్షణను సమన్వయంతో విస్తరించి, అధిక సంఖ్యలో యువతకు ఆధునిక శిక్షణ అందించవచ్చని పేర్కొన్నారు.వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం ప్రత్యేక హాస్టల్ సదుపాయం లేదని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నిత్యం సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీఎం–సేతు కింద ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల వసతి, భోజనం, పారిశుద్ధ్యం, చదువు తదితర సౌకర్యాలతో కూడిన హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని కోరారు.వరంగల్ ఐటీఐని హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హాస్టల్ భవనానికి ప్రాధాన్యం ఇచ్చి మంజూరు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## రిషభ్ పంత్ విలక్షణ ప్రవర్తన..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదు. తన బ్యాటింగ్‌తోనే కాకుండా చేష్టలతోనూ అతడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తాజాగా శ్రీలంక లెవెన్‌తో జ రిగిన వార్మప్ మ్యాచులోనూ అదే జరిగింది. కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పంత్ తన బ్యాటింగ్ శైలితోనే కాక, ఫుట్‌బాల్ నైపుణ్యాలతోనూ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే పెవిలియన్ చేరిన పంత్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడాడు. ఎంతలా అంటే.. మొదటి 21 బంతుల వరకు పరుగుల ఖాతానే తెరవలేదు. ధాటిగా ఆడే పంత్ ఇలా సుదీర్ఘంగా డిఫెన్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఆశ్చర్యపోయాడు. అయితే క్రీజులో కుదురుకున్నాక పంత్ తన అసలు రూపాన్ని బయటకు తీశాడు. శ్రీలంక బౌలర్లు కేశవ నువంత, దిలుమ్ సుదీరల బౌలింగ్‌లో విరుచుకుపడుతూ మూడు భారీ సిక్సర్లతో చెలరేగిపోయాడు. పంత్ సిక్సర్ల హోరును అడ్డుకోవడానికి స్పిన్నర్ సుదీర వైడ్ లెగ్ స్టంప్ దిశగా బంతులు వేయడం ప్రారంభించాడు. అయితే ఆ బంతులను వదిలేయకుండా, పంత్ తన కాళ్లతో ఫుట్‌బాల్ ప్లేయర్‌లా బంతిని వెనక్కి తన్నుతూ విన్యాసాలు చేశాడు. పంత్ చేసిన ఈ క్రేజీ పని చూసి మైదానంలోని ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి గాలే టెస్టుకు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లు శ్రమించినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు మెరుపులు మెరిపించారు. ఆగస్టు 15న గాలే వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరగనుంది.

## కింగ్ కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్

### స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్

ఛేజ్ మాస్టర్, రన్ మెషీన్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన స్టార్ బ్యాటర్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్, పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్ తన బ్యాక్‌యార్డ్ క్రికెట్ (పరదాల మధ్య సరదాగా ఆడే క్రికెట్) జట్టు కోసం టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీని ఓ బౌలర్‌గా సెలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. విరాట్ కోహ్లీని ప్రపంచమంతా గొప్ప బ్యాటర్‌గా భావిస్తుంటే.. మార్కస్ స్టోయినీస్ మాత్రం అతడిని బౌలర్‌గా ఎంచుకోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. స్టార్ స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్లో మార్కస్ స్టోయినీస్ ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. బ్యాక్‌యార్డ్ క్రికెట్లో విరాట్ కోహ్లీ వేసే పార్ట్-టైమ్ బౌలింగ్ అత్యంత విచిత్రంగా, బ్యాటర్లకు అర్థం కాని విధంగా ఉంటుందని స్టోయినీస్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ బౌలింగ్ స్టైల్ సాధారణంగా మిగతా బ్యాటర్లకు పెద్దగా పరిచయం ఉండదు కాబట్టి.. కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్‌గా ప్రత్యర్థులను బోల్తా కొట్టించగలడని స్టోయినీస్ సరదాగా వివరించాడు. విరాట్ కోహ్లీ తన కెరీర్ ప్రారంభంలో భారత్ తరఫున, ఐపీఎల్ లో ఆర్సీబీ తరఫున అప్పుడప్పుడు బౌలింగ్ చేసేవాడు. విరాట్ కోహ్లీ అంతర్జాతీయంగా టీ20ల్లో 4 వికెట్లు, వన్డేల్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో మాత్రం విరాట్ కోహ్లీకి వికెట్ దక్కలేదు. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫున విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 4 వికెట్లు తీశాడు. 2016లో గుజరాత్ లయన్స్ జట్టుపై 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయడం కోహ్లీ బెస్ట్ బౌలింగ్ గణాంకాలు కావడం గమనార్హం. చివరగా విరాట్ కోహ్లీ భారత్ తరఫున 2023 వన్డే ప్రపంచ కప్ లో నెదర్లాండ్స్ తో జరిగిన మ్యాచ్ లో బౌలింగ్ చేశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌లో డచ్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ ను ఔట్ చేసి దాదాపు 9 ఏళ్ల తర్వాత వన్డేల్లో వికెట్ సాధించాడు. అంతేకాకుండా తన హోమ్ టీమ్ ఢిల్లీ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 3 వికెట్లు, లిస్ట్-ఏ క్రికెట్లో 5 వికెట్లు పడగొ ట్టాడు. టెస్టులు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేలు, ఐపీఎల్ లో మాత్రమే కొనసాగుతున్నాడు. రాబోయే వెస్టిండీస్ తో స్వదేశంలో జరగబోయే వన్డే సిరీస్ లో విరాట్ కోహ్లీ తిరిగి భారత జట్టు తరఫున మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

# రక్తదానం..ఓ చిన్నారి ప్రాణానికి భరోసా






- తలసేమియా చిన్నారులకు అండగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ప్రతి 15 రోజులకు రక్తం అవసరం.. దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపు

**హనుమకొండ ప్రతినిధి , ఆగస్టు 10 (తరంగాలు)**:రక్తదానం..ఓ చిన్నారి ప్రాణానికి భరోసా ఇస్తుందని,దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు.తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో పోరాడుతున్న చిన్నారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. సోమవారం హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.తలసేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరమవుతుందని, జీవితాంతం రక్తం అందించాల్సిన పరిస్థితి ఉంటుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పటికే అనేకసార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించామని, తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలిచేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఇవీ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నాగార్జునసాగర్‌లో ఘనంగా వరుణ యాగం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

## పూల బొకేతో స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 10 తరంగాలు**
నాగార్జునసాగర్: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించారు.
వరుణ యాగంలో పాల్గొనేందుకు నాగార్జునసాగర్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.
హైదరాబాద్ నుండి హెలికాప్టర్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు.
విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు



పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ వరుణ యాగంలో 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలతో వేద మంత్రోచ్చారణల మధ్య యాగ కార్యక్రమాలను నిర్వహించారు.
రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు ఆనందంగా, సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ యాగాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, పంటలకు అనుకూలమైన వర్షాలు కురవాలని కోరుకుంటూ నిర్వహించిన వరుణ యాగం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు పండాలని ఆకాంక్షించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగార్జునసాగర్ పర్యటన సందర్భంగా ఆయనకు స్వాగతం పలికి,వరుణ యాగ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక కాజీపేట ఉర్సు దర్గా

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




**కాజీపేట, ఆగస్టు 10,తరంగాలు** :కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన గంధం ఉత్సవాల్లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ,దేవదాయ,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ , ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి , రేవూరి ప్రకాష్ రెడ్డి ,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఉర్సుకు హాజరైన ఎమ్మెల్యే కి దర్గా నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కుల, మతాలకు అతీతంగా జరిగే ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి ఖుసూర్ పాషా సాహెబ్,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి, ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,దర్గా నిర్వాహకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# క్లాస్‌రూమ్‌లో పాఠాలా

# క్యాంపస్‌లో కార్ల టెస్ట్ డ్రైవ్‌లా

- కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టయోటా కారు టెస్ట్ డ్రైవ్‌పై దుమారం.. ప్రిన్సిపాల్ అనుమతితోనే జరిగిందని ఆరోపణలు
- ప్రమోషన్స్ పేరుతో ప్రిన్సిపాల్ అత్యుత్సాహం?
- కళాశాల పని వేళల్లో అధ్యాపకురాలితో టెస్ట్ డ్రైవ్.. అదుపుతప్పి ధ్వంసమైన కారు
- ప్రభుత్వ కళాశాల ప్రాంగణాన్ని ప్రైవేట్ కంపెనీ ప్రమోషన్‌కు వినియోగించడంపై ప్రశ్నలు
- “ప్రిన్సిపాల్‌కు అటెండర్‌గా డీఐఈఓ వ్యవహరిస్తున్నారా?” -- టీఎస్ఎస్ఏ




**ఖమ్మం: తరంగాలు న్యూస్ ఆగస్టు 10**
కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో టయోటా కారు టెస్ట్ డ్రైవ్ చేయడం వివాదాస్పదంగా మారింది. ఖమ్మం జిల్లా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని వేళల్లోనే కాకతీయ టయోటా సంస్థకు చెందిన కారును కళాశాల ప్రాంగణంలో టెస్ట్ డ్రైవ్ చేసిన ఘటనలో కారు ప్రమాదానికి గురై తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కాకతీయ టయోటా సంస్థ ప్రమోషన్‌లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తీసుకువచ్చిన కారును, కళాశాల ప్రిన్సిపాల్ అనుమతితో ఓ అధ్యాపకురాలు టెస్ట్ డ్రైవ్ చేసినట్లు తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) ఆరోపించింది. టెస్ట్ డ్రైవ్ సమయంలో కారు అదుపుతప్పడంతో టూ/ఠ+003/ఠజ/55 ట్రేడ్ నంబర్ గల వాహనం ముందు భాగం ధ్వంసమైనట్లు పేర్కొంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో అధ్యాపకురాలికి గానీ, విద్యార్థులకు గానీ ఎలాంటి ప్రాణహాని జరగలేదని తెలిపింది. అయితే కళాశాల పని వేళల్లో విద్యార్థులకు బోధన జరగాల్సిన సమయంలో కారు ప్రమోషన్, టెస్ట్ డ్రైవ్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని టీఎస్-ఎస్ఏ ప్రశ్నించింది.

**ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ కంపెనీ ప్రమోషనా?**


ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ప్రైవేట్ కార్ల కంపెనీ ప్రమోషన్ కార్యక్రమానికి ఉపయోగించడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? కళాశాల పని వేళల్లో టెస్ట్ డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఏమిటి? సుమారు రూ.30 లక్షల విలువైన టెస్ట్ డ్రైవ్ వాహనం ధ్వంసమైన ఘటనకు బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని టీఎస్ఎస్ఏ డిమాండ్ చేసింది.

**“ప్రిన్సిపాల్‌కు అటెండర్‌గా డీఐఈఓ..?”**

ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ)పై కూడా టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యనారాయణ తీవ్ర ఆరోపణలు చేశారు.
కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ ఘటనపై జిల్లా అధికారులు వెంటనే స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. “ప్రిన్సిపాల్‌కు డీఐఈఓ అండగా నిలుస్తున్నారా? లేక అధికారులు బాధ్యతలను విస్మరిస్తున్నారా?” అని ప్రశ్నించారు.
ఖమ్మం జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయన ఆరోపించారు. డీఐఈఓ సుదీర్ఘకాలంగా జిల్లాలో విధులు నిర్వహిస్తుండటంతో పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో సత్సంబంధాలు ఏర్పడ్డాయనే ఆరోపణలు ఉన్నాయని, ఈ కారణంగానే కొన్ని కళాశాలలపై చర్యలకు వెనుకాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

**మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం**

కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెస్ట్ డ్రైవ్ పేరుతో జరిగిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు దామల్ల సత్యనారాయణ తెలిపారు.
కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల భద్రతకు విఘాతం కలిగేలా టెస్ట్ డ్రైవ్ నిర్వహించడానికి అనుమతి ఎలా ఇచ్చారు? విద్యార్థుల విద్యా సమయాన్ని ఇతర కార్యక్రమాలకు వినియోగించడానికి బాధ్యులు ఎవరు? ప్రభుత్వ కళాశాల ఆవరణను ప్రైవేట్ సంస్థల ప్రమోషన్‌కు ఉపయోగించడానికి నిబంధనలు అనుమతిస్తాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు.వ్వాల్సిన కళాశాల ప్రాంగణాన్ని కార్ల ప్రమోషన్ వేదికగా మార్చడం ఏమిటని ప్రశ్నించిన టీఎస్ఎస్ఏ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.






# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 10, తరంగాలు :**
రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఎండోమెంట్ కమిషనర్ సునీత ఘన స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్ర మంత్రికి వేద పండితులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు శేష వస్త్రాలను మంత్రి కి అందజేశారు. భద్రకాళి అమ్మవారిని మంత్రితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద అధికారులు, తదితరులు ఉన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలి

- సన్నూర్ మత్స్య సహకార సంఘం నూతన కమిటీకి ఎర్రబెల్లి దయాకర్ రావు శుభాకాంక్షలు



**రాయపర్తి, ఆగస్టు 10,తరంగాలు** :మత్స్యకారుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సన్నూర్ మత్స్య సహకార సంఘం నూతన కమిటీగా ఎన్నికైన అధ్యక్షులు పొన్నం సతీష్, ఉపాధ్యక్షులు గూబ అశోక్, కార్యదర్శి గూబ వెంకన్నలను రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు శాలువాలతో సన్మానించి అభినందించారు. నూతన కమిటీ సభ్యులు మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. నూతన కమిటీకి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మత్స్యకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జనధన్ ఖాతాలు పెరిగాయి వినియోగం తగ్గింది

- వరంగల్‌లో పీఎంజేడీవై ఖాతాలపై లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య ప్రశ్నలు
- ఆధార్ అనుసంధానం, రూపే కార్డులు, ఆపరేటివ్ ఖాతాలు,డీబీటీపై కేంద్రాన్ని నిలదీత



వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 10 ( తరంగాలు ): వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై ) కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై వివరాలు కోరారు.

### 3.02 లక్షలకు చేరిన జనధన్ ఖాతాలు

ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి.

అదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు, రూపే కార్డుల సంఖ్య 2,12,030 నుంచి 2,26,409కు పెరిగినట్లు కేంద్రం తెలిపింది.

### ఆపరేటివ్ ఖాతాల్లో తగ్గుదల

జనధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ.. వాటిలో నిరంతరం లావాదేవీలు జరిగే ఆపరేటివ్ ఖాతాల సంఖ్య మాత్రం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి సమాధానంలో వెల్లడించారు.

### ఖాతాలు తెరవడమే కాదు.. వినియోగంలో ఉండాలి

ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేలా బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయాలని కోరారు. మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా అన్ని వర్గాలకు డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### బ్యాంకింగ్ మౌలిక వసతులు బలోపేతం చేయాలి

వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ కడియం కావ్య కోరారు.

# బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శ



- రాయపర్తి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన..
- మృతుల కుటుంబాలకు సానుభూతి

**రాయపర్తి, ఆగస్టు 10, తరంగాలు** : వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

### కాట్రపల్లిలో గిరిక రాములు కుటుంబానికి పరామర్శ

గిరిక సురేష్ తండ్రి గిరిక రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి వెళ్లి రాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో న్యూస్ రిపోర్టర్

### సన్నూర్‌లో పలు కుటుంబాలకు పరామర్శ

సన్నూర్ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అల్లోజు వేణు తండ్రి అల్లోజు ఉప్పలయ్య, గూబ సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.అదేవిధంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చిన్నపాక మహేందర్, చిన్నపాక యాకమ్మ, చీకటి ఎల్లయ్య కుటుంబాలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



### పెరికేడ్‌లోనూ పరామర్శ

పెరికేడ్ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోగురు ఐలయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స తీసుకుంటూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎండీ మహబూబ్‌అలీని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

### వెంకటేశ్వరపల్లిలో పూలమ్మ కుటుంబానికి ఓదార్పు

వెంకటేశ్వరపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బుద్ధ పూలమ్మ కుటుంబాన్ని ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# చదువుతో పాటు ఆటలూ అవసరం

- యువతను ప్రోత్సహిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్
- జయరాం తండా (ఎస్) యువతకు రెండు క్రికెట్ కిట్ల పంపిణీ
- క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతాయన్న పరుపటి శ్రీనివాస్‌రెడ్డి



**రాయపర్తి, ఆగస్టు 10, తరంగాలు** : విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జయరాం తండా (ఎస్) గ్రామంలో స్థానిక యూత్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ కమిటీ సభ్యులకు రెండు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుపటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదువుతో పాటు ఆటలకు కూడా సమయం కేటాయిస్తే ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడటంతో పాటు జట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యువతలో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన క్రీడా సామగ్రి అందుబాటులో లేక అవకాశాలను కోల్పోతున్నారని, అలాంటి యువతను ప్రోత్సహించేందుకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు.క్రీడలకు చేయూతయువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనేలా గ్రామస్థాయిలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. క్రికెట్ కిట్లు అందించడంతో యువత ఆనందం వ్యక్తం చేసి ఫౌండేషన్ చైర్మన్ పరుపటి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, గుగులోత్ గౌస్ నాయక్, పెందోట శివ, ఐత జంపి, గారే నరేష్, పీరని రాజు, వార్డు నంబర్లు, స్థానిక పార్టీ ముఖ్య నాయకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సెపక్‌తక్రాలో భారత్‌కు కాంస్యం


ఢిల్లీ: భారత సెపక్‌తక్రా జట్టు ప్రతిష్టాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్ (కింగ్స్ కప్)లో కాంస్యం సాధించింది. బ్యాంకాక్‌లో జరిగిన 39వ ఎడిషన్‌లో టోర్నీ క్వాడ్రంట్ ఈవెంట్‌లో భాగంగా హోరాహోరీగా సాగిన సెమీస్‌లో భారత్.. 1-2 (15-9, 9-15, 9-15) తేడాతో థాయ్‌లాండ్ చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. త్వరలో జరుగబోయే ఆసియా క్రీడల్లో ఈ గేమ్ కూడా ఉన్నందున భారత్‌కు ఈ విజయం ఉత్సాహాన్నిచ్చేదే. ఈ టోర్నీ గ్రూప్ దశలో భారత్.. శ్రీలంక, వియత్నాం, పాకిస్థాన్, ఇరాక్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. వాలీబాల్‌ను పోలి ఉండే ఈ ఆటలో సాధారణంగా ముగ్గురు ప్లేయర్లు ఆడతారు. చేతులను ఉపయోగించకుండా తల, చాతి, కాళ్లతో బంతిని ఆడాల్సి ఉంటుంది. కానీ, క్వాడ్రంట్ విభాగంలో నలుగురు ఆటగాళు పోటీ పడతారు.

# వామప్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం..

### భారత్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపు

శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్టల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్‌తో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకుంది. 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(46 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్‌మన్ గిల్(54 బంతుల్లో 7 ఫోర్లతో 44), మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57) రెండు వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్‌తో పాటు సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. శ్రీలంక ఎలెవన్ ప్రధాన బౌలర్ కేశర నువాంత్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు బంతులను సిక్స్‌లు బాది భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయం భారత్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ మూడు రోజుల వామప్ మ్యాచ్ ద్వారా భారత ఆటగాళ్లకు కావాల్సిన ప్రాక్టీస్ లభించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో(65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. అనంతర భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 90 ఓవర్లలో 6 వికెట్లకు 357 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. శ్రీలంక ఎలెవన్ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. నిషాన్ ఫెర్నాండో(73 బంతుల్లో 10 ఫోర్లతో 63), నిపున్ ధనంజయ(56 బంతుల్లో 5 ఫోర్లతో 46), అంజల బండార(48 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీయగా.. గుర్నూర్ బ్రార్(2/37), రవీంద్ర జడేజా(2/33) రెండేసి వికెట్లు తీసారు. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ముందు 207 పరుగుల లక్ష్యం నమోదైంది.

## మహేశ్ బాబు ఏఐ వీడియో షేర్ చేసి వంగా కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్




ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

## ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు.ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది.



# వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్ ?

దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్



ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్ఆర్ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.

# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల


నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా




కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.
విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

## అభిమానికి చిరంజీవి అభినందనలు

మెగాస్టార్ చిరంజీవికి తన అభిమానులంటే ఎంతటి ప్రేమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అభిమానులనే తన కుటుంబంగా భావించే ఆయన.. అవకాశం వచ్చిన ప్రతిసారీ వారి పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా 'మెగా 158' షూటింగ్ సెట్స్‌లో జరిగిన ఓ అరుదైన, హృదయాన్ని హత్తుకునే సంఘటన ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'మెగా 158' షూటింగ్ సమయంలో కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్ మెగాస్టార్ చిరంజీవి దృష్టిని ఆకర్షించాడు. ఆయన పనితీరును గమనించిన చిరంజీవి.. నివాస్‌తో సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతడి వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడు నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని చెప్పడంతో పాటు.. చరణ్‌పై ఉన్న అభిమానంతో తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అనే పేరు పెట్టినట్లు చిరంజీవికి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించడమే కాకుండా.. తన కుటుంబంపై ఓ సాధారణ టెక్నీషియన్ చూపిస్తున్న అభిమానానికి భావోద్వేగానికి గురైనట్లు తెలుస్తోంది. అంతటితో ఆగకుండా



చిరంజీవి నివాస్ కుటుంబాన్ని తన ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. మెగాస్టార్ నుంచి వచ్చిన ఈ ఆహ్వానం ఆ కుటుంబానికి ఊహించని ఆనందాన్ని కలిగించింది. చిరంజీవి ఆహ్వానం మేరకు నివాస్ తన కుటుంబంతో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి మరో మధురమైన సర్‌ప్రైజ్ ఎదురైంది. మెగాస్టార్‌తో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా నివాస్ కుటుంబ సభ్యులతో కొంత సమయం గడిపారు. చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ ఆప్యాయంగా మాట్లాడారు. నివాస్ కుటుంబ సభ్యులతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలు దిగారు. మెగా ఫ్యామిలీతో గడిపిన ఈ అరుదైన క్షణాలు ఆ అభిమాని కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మారాయి. ఓ సాధారణ టెక్నీషియన్ కుటుంబానికి చిరంజీవి, రామ్ చరణ్ ఇచ్చిన గౌరవం, చూపించిన ఆత్మీయత ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## 'లెనిన్' దర్శకుడితో సినిమా?

రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' పాజిటివ్ బజ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ నెల 21న సినిమా విడుదలకానుంది. దీని తర్వాత హసిత్‌గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణుతో కలిసి రవితేజ ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేయబోతున్నారు. దిల్‌రాజు నిర్మాత. వివేక్ ఆత్రేయ, మారుతి కూడా రవితేజ కోసం కథలు సిద్ధం చేశారని తెలుస్తున్నది. ఇదిలావుండగా రవితేజ లైనప్‌లో మరో సినిమా ఖరారైనట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవలే 'లెనిన్'తో అక్కినేని అఖిల్‌కు బ్లాక్‌బస్టర్ హిట్ అందించారు దర్శకుడు మురళీకిషోర్ అబ్బూరు.వీశీజఱవం ఆయన దర్శకత్వంలో రవితేజ ఓ సినిమా చేయబోతున్నారని, ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనుందని ఫిల్మ్‌నగర్ టాక్. నిజానికి మూడేళ్లక్రితమే 'లెనిన్' కథను రవితేజకు వినిపించారట దర్శకుడు మురళీకిషోర్. అయితే అప్పటి కమిట్‌మెంట్స్ కారణంగా రవితేజ ఆ సినిమా చేయలేకపోయారని తెలిసింది. ఈ నేపథ్యంలో 'లెనిన్' దర్శకుడి సినిమాకు రవితేజ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రవితేజ లైనప్‌ని చూస్తే మురళీకిషోర్ అబ్బూరు చిత్రం కార్యరూపం దాల్చడానికి చాలా



సమయం పట్టే అవకాశం ఉందని అంటున్నారు.